# స్థానికేతరులను నమ్మి మోసపోవద్దు




గోవూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

- నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశా..
- మరోసారి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- సొంత నియోజకవర్గంలో ప్రజలు తిరస్కరిస్తే ఇక్కడ పోటీకి వచ్చారు..
- స్థానికేతరులకు ఇక్కడి సమస్యలు ఏం తెలుస్తాయి..
- మోస్రాలో స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి ప్రచారం

మోస్రా (చందూర్), నవంబర్ 21 : నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని.. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. సొంత నియోజకవర్గంలో ప్రజలు తిరస్కరిస్తే ఇక్కడ పోటీ చేయడానికి వచ్చిన వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

మోస్రా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్పీకర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులు చేసే పనులు ప్రజల గుండెల్లో నిలవాలని.. చరిత్రగా చెప్పుకోవాలన్నారు. మనం చేసే మంచి పనులు మన భావితరాలకు పనిచేయాలని అన్నారు. తాను చేసిన అభివృద్ధి ఏమిటో అందరి కండ్ల ముందే ఉందన్నారు. కొందరు నాయకులను అక్కడ ప్రాంతాల్లో ప్రజలు తిరస్కరించడంతో కోట్లు గుమ్మరించి బరిలో నిలిచారన్నారు. తాను మీ వాడినని.. ఇక్కడే పుట్టాను.. ఇక్కడే చస్తానన్నారు. పొరపాటున వారిని గెలిపిస్తే వారు ఢిల్లీ పాలకుల చెప్పుచేతల్లో నడవాల్సి ఉంటుందన్నారు. సొంత నిర్ణయాలు తీసుకునే అధికారమే ఉండదన్నారు. గోదావరి నీటిని కొండపోచమ్మసాగర్ ద్వారా నిజాంసాగర్‌లోకి మళ్లించి ప్రతి పంటకూ నీరందేలా చేసిన ఘనత తమదేనన్నారు. ప్రజలు ఆలోచించి మరోసారి ఆశీర్వదించాలని.. మరింత అభివృద్ధి చేస్తానన్నారు. మ్యానిఫెస్టోలోని అంశాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గోవూర్‌లో పలువురు బీజేపీ నాయకులు స్పీకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. స్పీకర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, పోచారం రవీందర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గుత్ప విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు, వైస్ ఎంపీపీ కత్తి శంకర్, ఎంపీటీసీ మమత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, ఫిరోజ్, సర్పంచులు సుమలతా రాంరెడ్డి, సున్నం భూమయ్య, నరేందర్ రెడ్డి, విమలా లింగయ్య, సొసైటీ చైర్మన్లు సుధాకర్ రెడ్డి, గంగారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గజదొంగ ఏనుగు రవీందర్‌రెడ్డితో జాగ్రత్త



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూబాధితులు

- ఎర్రాపహాడ్‌లో మా భూములను కబ్జా చేశాడు
- మేం తరిమేస్తే బాన్సువాడకు వచ్చిండు
- కాంగ్రెస్ అభ్యర్థిపై సొంత గ్రామ దళితుల ఆరోపణ

బాన్సువాడ, నవంబర్ 21: కాంగ్రెస్ పార్టీ నుంచి బాన్సువాడలో పోటీ చేస్తున్న ఏనుగు రవీందర్‌రెడ్డి గజదొంగ అని, ఆయనతో జాగ్రత్తగా ఉండాలని బాధితులు సూచించారు. తమ భూములతోపాటు సర్కారు జాగలను కూడా మింగేశాడని ఆరోపించారు. రవీందర్ రెడ్డి స్వగ్రామమైన తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన దళిత భూబాధితులు చిట్యాల సాయన్న, దుర్గవ్వ, గాదె బాలయ్య బాన్సువాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 40 ఏండ్ల క్రితం అప్పటి ప్రభుత్వం 25 మంది లబ్ధిదారులకు 30 ఎకరాల అసైన్డు భూమిని ఇచ్చిందన్నారు. పక్కనే ఉన్న 300 ఎకరాల భూమిని ఏనుగు రవీందర్ రెడ్డి కొనుగోలు చేసి దళితుల భూములను కూడా కబ్జా చేశాడని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యం చేసి, పోలీసు స్టేషన్‌లో వేసి కొట్టించాడన్నారు. ఈ భూముల విషయంలో ఎన్నో రోజులు తాము నిరాహార దీక్ష చేపట్టామన్నారు. ఎంతో మంది నాయకులను కలిసి వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. భూములను సర్వే చేసిన అధికారులకు డబ్బులను ఎరజూపి లొంగదీసుకున్నాడని, తమకు కూడా ఎంతోకొంత ముట్టజెప్పి ఒప్పించాలని చూశాడని తెలిపారు. అయినా తాము ఒప్పుకోలేదన్నారు. భూములే కావాలని పట్టుబడితే ఎల్లారెడ్డి, కామారెడ్డిలో కేసులు పెట్టించాడని, పోలీసులతో కొట్టించాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రాపహాడ్‌కు వచ్చే కాలువను తన ఫాంహౌస్‌కు మళ్లించి రూ. రెండు కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశాడని ఆరోపించారు. ఎల్లారెడ్డిలో కబ్జాకోరు రవీందర్‌రెడ్డిని ప్రజలు తిరస్కరిస్తే బాన్సువాడకు వచ్చాడని అన్నారు. ఈ భూ బకాసూరుడిని నమ్మి ఓటేస్తే బాన్సువాడ నియోజకవర్గ ప్రజలు కూడా మోసపోతారని అన్నారు. ఆయన దారుణాలు, దౌర్జన్యాలకు రక్తపాతం అవుతుందని హెచ్చరించారు.

# బీఆర్ఎస్‌కు ఆటో యూనియన్ మద్దతు

- ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఖలీల్‌వాడి, నవంబర్ 21 : బీఆర్ఎస్ అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాకు నిజామాబాద్ ఆటో యూనియన్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. నగరంలోని బస్టాండ్ వద్ద సీ ఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆటో డ్రై వర్ల గురించి ఆలోచన చేశాడని, తమ జీవితాలు బాగుపడాలనే ఉద్దేశంతో ఫిట్‌నెస్ ట్యాక్స్ రద్దు చే శారన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు కూడా తమ గురించి ఆలోచన చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ రావాలని ముక్తకంఠంతో నినదించారు.



సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

### బీఆర్ఎస్ ప్రజల ప్రభుత్వం



బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజల కోసం పని చేస్తున్నది. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచన చేస్తున్నది. మా ఆటో డ్రైవర్ల గురించి గత ప్రభుత్వాలు ఏనాడూ ఆలోచన చేయలేదు. మా సంపూర్ణ మద్దతు బీఆర్ఎస్‌కే.

**- అబ్దుల్ జబ్బార్, ఆటో డ్రైవర్**

### మా జీవితాల్లో వెలుగు నింపారు



బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మా జీవితాల్లో వెలుగులు నిండాయి. ఒకవైపు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆటోలపై ఫిట్‌నెస్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేశారు. ఇంతకన్నా ఏం కావాలె. మా గురించి ఆలోచన చేసిన బీఆర్ఎస్‌కే మా పూర్తి మద్దతు తెలుపుతున్నాం.

**-శంకర్, ఆటో డ్రైవర్**

### మా గురించి ఆలోచించిన ఏకైక వ్యక్తి కేసీఆర్



మా బతుకుల గురించి ఆలోచన చేసిన ఏకైక వ్యక్తి సీఎం కేసీఆర్. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే అందరం సంతోషంగా ఉన్నాం. వేరే పార్టీలకు ఓటు వేస్తే మళ్లీ కష్టాలు కొని తెచ్చుకున్నట్లే. బీఆర్ఎస్ అభ్యర్థి గణేశ్ గుప్తాకే మా ఓటు.

**-సాయిలు, ఆటో డ్రైవర్**

### గతంలో మా గురించి ఎవరూ పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు ఎన్ని ఏండ్లు పాలించినా మా గురించి పట్టించుకోలేదు. కానీ సీఎం కేసీఆర్ ఒక్కరే ఆటోడ్రైవర్ల జీవితాల గురించి ఆలోచించి మంచి నిర్ణయం తీసుకున్నారు. మళ్లీ బీఆర్ఎస్‌కే మా సంపూర్ణ మద్దతు.

**- పాషా, ఆటో డ్రైవర్**

# బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



పార్టీలో చేరి ఎమ్మెల్సీతో సెల్ఫీ దిగుతున్న యువతులు

ఖలీల్‌వాడి నవంబర్ 21 : నిజామాబాద్ నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత , అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా సమక్షంలో పెద్ద సంఖ్యలో యువతీయుకులు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ప్రతి డివిజన్ నుంచి యువతీయువకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత ఎమ్మెల్సీ కవితకు తల్వార్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా యువతీయువకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ వచ్చిన తర్వాతే నగరం అద్భుతంగా తయారైందని తెలిపారు.

**బోధన్ నేతలు..**

బోధన్, నవంబర్ 21: బోధన్ నియోజకవర్గంలోని పలు పార్టీలకు చెందిన నాయకులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నిజామాబాద్‌లోని ఎమ్మె ల్సీ కవిత నివాసంలో బోధన్ ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ ఆబేద్ అలీ, మాజీ కౌన్సిలర్ మీర్ వహీద్ అలీ, రెంజల్ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు తిరుపతి హన్మాండ్లు (బుజ్జి) బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ పటిష్టానికి, ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు.

**సింగిల్‌విండో మాజీ చైర్మన్...**

ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామానికి చెందిన సింగిల్‌విండో మాజీ చైర్మన్ చిక్కెల లక్ష్మణ్ స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్ సమక్షంలో పార్టీలో చేరారు. లక్ష్మణ్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జాన్కంపేట్ గ్రామానికి చెందిన నాయకులు జయవర్ధన్, సుంకరి రాజా గౌడ్, అమ్జద్‌తో పాటు పలువురు ఉన్నారు.